క్లుప్తంగా

బాధిత కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ



బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు: కల్లూరు పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన బీరవల్లి వెంకటమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమెకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో మంజూరైన బీమా చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మృతురాలి భర్త రామకోటికి అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, ఎంపీపీ బీరవల్లి రఘు, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే కమ్లి, యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



మేనిఫెస్టో పత్రాలతో బీఆర్ఎస్ నాయకులు

తల్లాడ: మేజర్ పంచాయతీ 2వ వార్డులో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరిస్తూ.. కారు గుర్తుపై ఓటేసి సండ్రను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, తల్లాడ పట్టణ అధ్యక్షులు జీవీఆర్, ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, దూపాటి నరేష్‌రాజు, తేళ్లూరి రఘు, గోవిందరావు, మహేష్, శివ పాల్గొన్నారు.

చంద్రుపట్లలోని బీసీ కాలనీలో..



ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కల్లూరురూరల్: చంద్రుపట్ల గ్రామం బీసీ కాలనీలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అలాగే ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రసాద్, రవి, రాధాకృష్ణ, బీసీ నాయకులు రామారావు, రమేష్, శ్రీను, రామకృష్ణ, గోపాలరావు, గోపాలరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చల్లగుండ్ల కృష్ణయ్య, నాయకులు

సత్తుపల్లి: పట్టణంలోని విద్యానగర్‌రోడ్‌లో మామిళ్లపల్లి కృష్ణయ్య వాటర్‌ప్లాంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని శుక్రవారం డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు ఎస్‌కె రఫీ, యాగంటి శ్రీనివాసరావు, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, మల్లూరు అంకమరాజు, అమరవరపు విజయనిర్మల, మల్లూరు పద్మావతి, మహ్మద్ అనీషా, గాదె నర్సింహారెడ్డి, మాధురి మధు, మరికంటి శ్రీను పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో గురువారం రాత్రి ఇతర పార్టీల నుంచి 27 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, దొడ్డా చిన్న శ్రీను, మారెళ్ల దేవేందర్ పాల్గొన్నారు.

అంబటి రాంబాబును అడ్డుకోవడం సరికాదు

తల్లాడ: ఏపీ మంత్రి అంబటి రాంబాబును టీడీపీ శ్రేణులు అడ్డుకోవడం సరైంది కాదనీ తల్లాడ మండల వైఎస్ఆర్ అభిమానులు రాగం రమణ, బొమ్మగాని డిల్లీ, కోసూరి రామారావు, గోన నరసింహారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్నారుగూడెంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు పేర్కొన్నారు.



మిగిలింది 3 రోజులే

- ఓటు నమోదుకు ఇదే చివరి అవకాశం
- ఈ నెల 30వ తేదీ వరకే గడువు
- నియోజకవర్గంలోని ఓటర్లు 2,38,621

సత్తుపల్లిటౌన్: అర్హులైన వారు కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. అసెంబ్లీ ఎన్నికలకు దాదాపు నెలరోజులు మాత్రమే గడువు ఉంది. సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనుల్లో అధికార యంత్రాంగా నిమగ్నమైంది. మరో రెండు రోజులే ఓటు నమోదుకు గడువు ఉంది. ఎన్నికల్లో ఓటు వేయటానికి జాబితాలో పేర్లు లేనివాళ్లు, 18 ఏళ్ల నిండినవాళ్లు ఓటర్లుగా నమోదు చేసుకోవటానికి అవకాశం కల్పించారు. ఇందు కోసం ఈ నెల 30వ తేదీ వరకు ఎన్నికల సంఘం గడువు విధించింది. ఇప్పుడు స్పందించి నమోదు చేసుకుంటేనే ఓటరు జాబితాలో పేరు వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఈ నెలాఖరు తరువాత దరఖాస్తుకు అవకాశం ఉండదు. ఈలోగానే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచనలు చేస్తున్నారు.



ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న బీఎల్‌ఓలు

త్వరపడితేనే ఓటేసే అవకాశం..

అక్టోబర్ 1వ తేదీ నాటికి యువతీ, యువకులు కొత్త ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేయించుకోవచ్చు. ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేర్లు లేనివారు.. నమోదు కోసం ముందుకు రావాలని బూత్‌లెవల్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఓటర్ల నమోదు దరఖాస్తులను పరిశీలించి వారిలో అర్హులను గుర్తించి ప్రధాన ఓటర్ల జాబితాకు అనుబంధ జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. వీరందరికీ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే వీలుంటుంది. ప్రస్తుతం ఓటు నమోదుకు ఇదే చివరి అవకాశమని త్వరగా దరఖాస్తులు అందించాలని అధికారులు సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి..



18 సంవత్సరాలు నిండిన అర్హులందరు ఓటు హక్కును కలిగి ఉండాలి. ఇప్పటి వరకు జాబితాలో పేర్లు లేనివారు, పద్దెనిమిది ఏళ్లు నిండిన వారు ఈ నెల 30వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలి.

– అశోక్‌చక్రవర్తి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సత్తుపల్లి

సత్తుపల్లి నియోజకవర్గంలో 2,38,621 మంది ఓటర్లు..

ఇప్పటి వరకు ప్రస్తుతం సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండలంలో 44,959 మంది, కల్లూరు 52,627 మంది, పెనుబల్లి 42,421, సత్తుపల్లి 62,621, వేంసూరు 35,993 మంది ఉన్నారు. మొత్తం 1,16,968 మంది పురుష ఓటర్లు, 1,21,645 మంది మహిళా ఓటర్లు, 8 మంది ట్రాన్స్‌జండర్లు ఉండగా మొత్తం 2,38,621 మంది ఓటర్లు ఉన్నారు.

పెరిగిన పోలింగ్ కేంద్రాలు..

తల్లాడలో 57 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కల్లూరులో 63, పెనుబల్లిలో 50, సత్తుపల్లిలో 75, వేంసూరు మండలంలో 46 చొప్పున మొత్తం 291 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. గత ఎన్నికల్లో 264 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు 27 పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. గత ఎన్నికల్లో 87.96శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో పోలింగ్‌శాతాన్ని పెంచేందుకు అధికార యంత్రాంగం ఓటర్లను చైతన్యవంతం చేయటంలో నిమగ్నమైంది.

దుమ్ములేవకుండా చర్యలు తీసుకోండి

సత్తుపల్లిరూరల్: సింగరేణి బొగ్గగనుల లోపల దుమ్ము లేవకుండా తగినన్ని వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజుతో కలిసి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో ఆఫ్‌లోడింగ్ ఆపరేషన్స్, మైన్స్‌ప్లాన్స్‌పై సమీక్షించారు. అనంతరం మైన్‌లోపలకు వెళ్లి క్వారీ ఆపరేషన్స్‌ను పరిశీలించారు. కాంట్రాక్టర్స్ పనితీరు మెరుగుపరుచుకోవడానికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, డీజీఎం సోమశేఖర్‌రావు, మధుసూదన్, అధికారులు పాల్గొన్నారు.



జేవీఆర్ ఓసీలో పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి

భట్టితోనే నియోజకవర్గ అభివృద్ధి



ఇస్త్రీ చేస్తున్న మల్లు సూర్య విక్రమాదిత్య

మధిర: మధిర నియోజకవర్గ అభివృద్ధి మల్లు భట్టి విక్రమార్కతోనే సాధ్యమవుతుందని ఆయన తనయుడు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మల్లు సూర్య విక్రమాదిత్య అన్నారు. శుక్రవారం ఎంప్లాయిస్ కాలనీలో మార్నింగ్ వాక్ చేశారు. ఎన్నికల ప్రచారం నిర్వహించి తన తండ్రిని గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. అనంతరం జిలుగుమాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. టిఫిన్ బండి వద్ద దోసెలు వేశారు. లాండ్రీ షాపు వద్ద ఇస్త్రీ చేసి ఆయా వర్గాల ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనా ధని కుమార్, దేవిశెట్టి రంగారావు, వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎర్రగుంట రమేష్, నవీన్ రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే అధికారం..



కరపత్రాలను అందిస్తున్న రాగమయి, నాయకులు

సత్తుపల్లి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యానగర్‌రోడ్, కృషి బైపాస్‌రోడ్, నేతాజీరోడ్ ప్రాంతాల్లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎండీ కమల్‌పాషా, మానుకోట ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐదోరోజు కొనసాగిన జాతర



ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలం

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువుతీరిన శ్రీకోటమైసమ్మ తల్లి జాతరకు 5వ రోజు శుక్రవారం సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే జాతరకు.. ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సాట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు లు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయగా, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్ఐ లు పుష్పాల రామారావు, ప్రవీణ్‌కుమార్‌లు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు..

ముదిగొండ: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దని తహసీల్దార్ రామారావు అన్నారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా జరిగేలా పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా జరిగేలా ఓటర్ల జాబితా తయారు చేయాలని అన్నారు. 80సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులను గుర్తించాలన్నారు. సమావేశంలో డీటీ రెహమాన్, ఆర్ఐ ఉషారాణి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు వీల్‌చైర్లు పంపిణీ



దివ్యాంగ పిల్లలకు వీల్‌చైర్లు అందజేస్తున్న దృశ్యం

కల్లూరు: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అలింకో వారి సహకారంతో మండల పరిధిలోని దివ్యాంగ పిల్లలకు వీల్ చైర్లు, ఎమ్మార్ కిట్లు, చెవిటి మిషన్లు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు నవ్యకాంత్, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఫిజియోథెరపిస్ట్ మాగంటి ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీను, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ వై.సుధారాణి, సృజన, సీసీఓ షాబి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కీర్తి, సీఆర్‌పీ రాము, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోతుల బెడద.. కాలిన ట్రాన్స్‌ఫార్మర్

కారేపల్లి: కోతుల బెడద కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిన సంఘటన శుక్రవారం రాత్రి కారేపల్లిలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. కారేపల్లి సంతబజార్‌లోని మదీనా సెంటర్‌లో.. కోతులగుంపు ఎగురుకుంటూ వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ జరిగి ట్రాన్స్‌ఫార్మర్ మొత్తం కాలిపోయింది. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సుమారుగా రెండుగంటలు పాటు కారేపల్లి గ్రామం అంధకారం ఉంది.

ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

సత్తుపల్లిటౌన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేస్తున్నామని.. ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్‌లో జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియమావళికి విఘాతం కలిగితే సివిజిల్‌కు ఫిర్యాదు చేస్తే వంద నిమిషాలలో పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో పరిశీలించటం జరుగుతుందని తెలిపారు. ఇంటింటా ప్రచారానికి కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ప్రచార రథాల వివరాలు అందించాలని, సభలు, సమావేశాలలో జెండాలు పెట్టుకొని అనంతరం తొలగించాల్సిన బాధ్యత ఆయా పార్టీలదేనని పేర్కొన్నారు. నామినేషన్‌కు ముందు ఖర్చు పార్టీల ఖాతాలోకి వెళ్తుందని.. నవంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్లకు వచ్చేటప్పుడు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ యోగేశ్వరరావు, కమిషనర్ కె.సుజాత, ఎంపీడీఓ జయరాం, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి

పథకాలు ఆపాలని కాంగ్రెస్ కుట్ర



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి

సత్తుపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిలిపివేయాలని ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ పార్టీ కోరడం.. మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ముందే రైతుబంధు ఇవ్వాలని కుట్రలు చేస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి విమర్శించారు. సత్తుపల్లిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అమలు చేయటం ఇష్టం లేనట్లుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో సంక్షేమ కార్యక్రమాలు సజావుగా సాగుతాయని స్పష్టం చేశారు. రైతాంగాన్ని మభ్యపెట్టాలని చూస్తే కాంగ్రెస్ మెడకు ఉరితాడు అవుతుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, గాదె నర్సింహారెడ్డి, ఎస్‌కె చాంద్‌పాషా, చల్లగుళ్ల కృష్ణయ్య, అద్దంకి అనీల్, నర్సింహారావు, శ్రీను, ఖాసీం, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

చింతకాని: బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ తాళ్లూరి హరీష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సంక్షేమ పథకాలతో పాటుగా.. మేనిఫెస్టోను వివరించి నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు అలవాల వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాళ్లూరి హరీష్‌బాబు

పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

సత్తుపల్లిటౌన్: ప్రజా సమస్యలు పరిష్కరించకుండా మభ్యపెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపు నిచ్చారు. సత్తుపల్లి కళాభారతిలో శుక్రవారం జరిగిన సీపీఐ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడిందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలాన మాట్లాడుతూ.. మోదీ విధానాలతో దేశంలో ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, కొమ్మినేని సుధాకర్, రామకృష్ణ, శివరామకృష్ణ, యోబు, శ్రావణ్‌కుమార్, రామలక్ష్మి, రమేష్, రంజాన్, లక్ష్మి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రహ్మతుల్లా పాల్గొన్నారు.

విద్యుత్ కష్టాలు

లోడ్ పెరగడంతో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు

- ఎండిపోతున్న పంటలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండిలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో 20గ్రామాలలోని 7,200 గృహవిద్యుత్ వినియోగదారులు ఉన్నారు. విద్యుత్ సరఫరాలో పాటుగా.. వరి, మిర్చి, పత్తి, పంటలకు మోటార్లకు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. విద్యుత్ వినియోగం అధికం కావటం వల్ల ఓవర్ లోడింగ్‌తో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. దీంతో 10వేల ఎకరాల్లో వేసిన పంటలు ఎండిపోయే దశకు చేరుకోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఆరు గంటలు కూడా త్రీఫేస్ కరెంట్ రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. టేకులపల్లి 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పెద్దకోరుకొండి సబ్‌స్టేషన్‌కు లింక్ లైన్ ఏర్పాటు చేశారు. కాని కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచిపోయాయి.



పెద్దకోరుకొండి సబ్‌స్టేషన్



ఎండిపోతున్న మిర్చిచేను

పంటలు కాపాడాలి..



త్రీఫేస్ విద్యుత్ సరఫరా సరిగ్గా లేక పంటలు ఎండి పోతున్నాయి. త్రీఫేస్ విద్యుత్ సరఫరాచేసి పంటలను కాపాడాలి. ఈసీజన్‌లో వర్షాలు సరిగా కురవనందున వ్యవసాయమోటార్ల ఆయకట్టు కింద పంటలు వేశాం. వ్యవసాయంలో పెట్టుబడి పెట్టి నష్టపోతున్నాం.

– తాళ్లూరి శ్రీనివాసరావు, రైతు, పెద్దకోరుకొండి



అటెన్షన్ ప్లీజ్

కంప తొలగించరూ..

ముదిగొండ మండలంలోని కమలాపురంలో శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు కంకర తేలడమే కాకుండా.. పిచ్చి, కంప చెట్లతో రహదారి మూసుకుపోయింది. ఈ రహదారిలో నిత్యం గంధసిరికి, కమలాపురం పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు, వివిధ వాహనదారులు ఇబ్బందులకు గురౌతున్నారు. కిలోమీటర్ దూరం ఉన్న ఈ రహదారి ఏళ్లతరబడి అధ్వానంగా ఉంది. ఇకనైన పంచాయతీ అధికారులు కల్పించుకోని.. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా కంపను తొలగించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– ముదిగొండ



ప్రశ్నించాల్సిన అధికారి : అశోక్‌కుమార్, ఎంపీడీఓ, ముదిగొండ
సెల్ నంబర్ : 9440906918

29న 'ఇస్తేమా' సమావేశం



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న ముస్లిం కమిటీ పెద్దలు

మధిర/ఎర్రుపాలెం: మధిర పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 29న నిర్వహించే ఇస్తేమా (ముస్లింల సమైక్య వేదిక) సమావేశాన్ని జయప్రదం చేయాలని మధిర, ఎర్రుపాలెం మండల ముస్లిం కమిటీ అధ్యక్షులు షేక్ గాలింపు, బాసిత్ అలీ తెలిపారు. శుక్రవారం మధిరలో, ఎర్రుపాలెంలోని స్థానిక మజీద్‌లో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని.. ముఖ్య అతిథులుగా ముఫీ ఆదం ఖాస్మి నాజీం దారుల్ ఉలూం (ఉర్దూ వక్త), జనాబ్ అఫ్రోజ్ అహ్మద్ అత్తిలి హాజరవుతారని తెలిపారు. కావున మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు చెందిన ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశాల్లో ప్రధాన కార్యదర్శి రఫీ, నాగుల్‌మీరా, స్థానిక మజీద్ కమిటీ అధ్యక్షులు ఇస్మాయిల్ మాబులు పాల్గొన్నారు.